# సాక్షి అనకాపల్లి

ఆదివారం । 14 । మే । 2023




**అనుమానం పెనుభూతమై..**

అనుమానంతో ఓ వ్యక్తి కట్టుకున్న భార్యను నిర్దాక్షిణ్యంగా చంపేసిన దారుణం నక్కపల్లి మండలం చీడికలో జరిగింది. 8లో



**ప్రతి పీహెచ్‌సీలో 14 మంది**

సరిపడా వైద్య సిబ్బందితో పీహెచ్‌సీలలో సంపూర్ణమైన సేవలు అందిస్తున్నట్టు డీఎంహెచ్‌వో హేమంత్ చెప్పారు. 8లో



**చల్లని తల్లి మోదమ్మ**

పాడేరు: మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది.



## న్యూస్‌రీల్

### అమ్మ ప్రేమ అమృతం

**తోటకూర గింజలతో తల్లీ బిడ్డ చిత్రం**



**మాకవరపాలెం:** అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని తూటిపాల గ్రామానికి చెందిన బి.రవికుమార్ తోటకూర గింజలతో తల్లీబిడ్డ చిత్రాన్ని రూపొందించారు.

మాతృమూర్తులందరికీ వందనం చెబుతూ 25 గంటల పాటు శ్రమించి 2,500 తోటకూర గింజలతో చిత్రాన్ని రూపొందించారు. సమాజహితంగా అనేక చిత్రాలను రూపొందించి రవికుమార్ ఆదర్శంగా నిలుస్తున్నారు.

### ఏఎంసీలో పెరిగిన పీజీ సీట్ల భర్తీకి ఏర్పాట్లు

**మహారాణిపేట (విశాఖ):** ఆంధ్రా వైద్య కళాశాల(ఏఎంసీ)లో పెరిగిన పోస్టు గ్రాడుయ్యేట్(పీజీ) సీట్ల భర్తీకి ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు తెలిపారు. ప్రస్తుతం ఏఎంసీలో 38 వైద్య విభాగాల్లో 237 సీట్లు ఉన్నాయి. 27 వైద్య విభాగాలకు సంబంధించి 131 సీట్లు పెంచాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన వారికి(ఈడబ్ల్యూఎస్) 131 సీట్లు కేటాయించింది. దీంతో ఏఎంసీలో మొత్తం సీట్ల సంఖ్య 368కి చేరింది. అయితే ఈ విద్యా సంవత్సరంలో 98 పీజీ సీట్ల భర్తీకి అనుమతులు వచ్చాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా మెడికల్, యురాలజీ, ఎండోక్రినాలజీ తదితర విభాగాలకు అనుమతులు రావాల్సి ఉందన్నారు.

### విశాఖ రైల్వేస్టేషన్‌కు కన్సల్టేటివ్ కమిటీ

**తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర):** విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ నియమిస్తూ ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఉత్తర్వులు జారీచేశారు.

స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి కె.విజయ్‌మోహన్, ఐశ్వర్య గంగూరి, స్థానిక విద్యా సంస్థల నుంచి జి.ఎస్.కె.చక్రవర్తి, ఎస్ఎస్ఎస్ఎస్ రెడ్డి, స్థానిక సంస్థల నుంచి కందుల నాగరాజు, పల్లా అప్పలకొండ, విశిష్ట వ్యక్తుల నుంచి కొప్పుల రామ్‌కుమార్, పి.వి.ఎస్.కె.సురేష్, నూకవరపు బాబ్జీ, డానియేల్ జోసఫ్‌లను నియమించారు.

## బ్యూటీ స్పాట్.. ఫొటో షూట్

అందాలకు నెలవైన వాడ్రాపల్లి ఆవ ఫొటో షూట్‌లకు, లఘు చిత్రాల చిత్రీకరణకు హాట్ స్పాట్‌గా మారింది. ఆవలో షూటింగ్‌కు అవసరమయ్యే సదుపాయాలు ఉండడంతో పర్యాటకులతోపాటు నూతన జంటలు, షార్ట్ ఫిల్మ్ కళాకారులు తరలివస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో షూటింగ్‌లు జరుగుతున్నాయి. బోట్లపై షికారు చేస్తూ తమకు అనువుగా ఉండేలా షూట్ చేస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో వెడ్డింగ్ షూట్‌లు తీసే వారితో ఈ ప్రాంతం కళకళలాడుతోంది. చుట్టూ కొండలు.. గలగల పారే నీరు.. నీటిలో తేలియాడే తామర



పువ్వులు.. ఆవ ఒడ్డున చెట్లు.. ఇలాంటి అందాలతో ఈ ప్రాంతం ఎంతగానో ఆకట్టుకుంటోంది.

– మునగపాక



## త్వరలో కిసాన్ డ్రోన్లు

- పురుగు మందు పిచికారీకి స్మార్ట్ స్ప్రేయర్
- రైతులకు చేదోడువాదోడుగా ఆధునిక సాంకేతికత
- 40 శాతం సబ్సిడీపై రూ.10 లక్షల విలువైన డ్రోన్లు
- విద్యావంతులైన రైతులకు పైలెట్లుగా శిక్షణ



**సాక్షి, అనకాపల్లి:** వ్యవసాయ రంగంలో ఇప్పుడు డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఎరువులు, పురుగు మందుల పిచికారీ, ఇతర అవసరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఈ రంగంలో 22 రకాల పనులు చేసేందుకు వీలుగా డ్రోన్లను అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలిచేలా ఆర్బీకేల పరిధిలో కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తెస్తోంది. వీటి వినియోగానికి ఇప్పటికే రైతులకు డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇస్తోంది. ఆర్బీకేలకు అనుబంధంగా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న కిసాన్ డ్రోన్ల నిర్వహణ కోసం.. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో చదువుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఈ శిక్షణ ఇస్తోంది. తాజాగా మరో అడుగు ముందుకేసి భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా గ్రామీణ నిరుద్యోగ యువతకు కూడా డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో వ్యవసాయ డిప్లమో లేదా ఏదైనా ఇంజినీరింగ్ పట్టభద్రులైన యువతకు ఈ శిక్షణ ఇస్తారు. కనీసం మూడేళ్ల పాటు ఆర్బీకేల్లో పనిచేసేందుకు ముందుకొచ్చే వారికి డ్రోన్ పైలెట్ శిక్షణ ఉచితంగా ఇస్తున్నారు. జిల్లాలో తొలి విడతలో 13 మందిని ఎంపిక చేయగా ఇప్పటికే నలుగురికి శిక్షణ కూడా పూర్తయింది. డ్రోన్ల సాయంతో కూలీల కొరత తీరనుంది.

**పనిచేసే విధానం**

మొక్కలను గుర్తించేందుకు, వెంటనే వాటిపై రసాయనాలు జల్లేందుకు అనువైన రియల్‌టైం ప్లాంట్ డిటెక్షన్ ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ (ఈసీయూ) అభివృద్ధి చేశారు. మొక్క సంకేతాల ఆధారంగా సోలేనోయిడ్ వాల్వ్‌లను తెరవడానికి, మూయడానికి అనువుగా మైక్రో కంట్రోలర్ యూనిట్ పనిచేస్తుంది. ఈ యంత్రంలో 24 వాట్స్ సామర్థ్యం కలిగిన మూడు బ్యాటరీలను అమర్చారు. వాటిలో రెండు బ్యాటరీలు యంత్రం పనిచేయటానికి, మరో బ్యాటరీ మొక్కలపై పురుగు మందులను పిచికారీ చేసేందుకు ఉపయోగపడుతుంది. ఈ స్మార్ట్ స్ప్రేయర్లపై పైలెట్స్‌కు శిక్షణ అందించారు.

**ప్రయోజనాలు ఇలా...**

- ఈ యంత్రాన్ని ఉపయోగించడం వల్ల రైతులు భుజాలపై 20 లీటర్ల బరువు కలిగిన స్ప్రేయర్లను ఎత్తుకొని పొలం చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.
- గట్టుపై నిలబడి పొలం అంతా పురుగు మందు తడిచేలా ఆపరేట్ చేసుకోవచ్చు.
- మందులు వృథా కాకుండా తెగులు సోకిన మొక్కలపై మాత్రమే పడేటట్లు చూసుకోవచ్చు.
- పై నుంచి మందును పిచికారీ చేయటం వల్ల మొక్క మొత్తం పూర్తిగా తడుస్తుంది.
- దీంతో మొక్క పైభాగం నుంచి కాండం వరకు ఏ విభాగంలో ఉన్న పురుగులైనా చనిపోయే అవకాశం ఉంటుంది.
- యంత్రం పొలంలో దిగబడకుండా ఉండేందుకు, ఎత్తుపల్లాలను దాటేందుకు వీలుగా 5.8 పరిమాణం గల న్యూమాట్రిక్ టైర్లను వాడారు.

**నలుగురికి శిక్షణ పూర్తి**



అతి త్వరలో డ్రోన్ పైలెట్లు అందుబాటులోకి రానున్నాయి. తొలి దశలో 13 మందిని ఎంపిక చేయగా.. ఇందులో నలుగురికి శిక్షణ కూడా పూర్తయింది. రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి జిల్లాలో డ్రోన్ పైలెట్స్‌కు శిక్షణ పూర్తయి.. అందుబాటులోకి రానున్నారు. ఇందులో ఎవరైతే శిక్షణ పొందుతారో వారికి ప్రభుత్వం రూ.10 లక్షల రుణ సదుపాయం కూడా కల్పిస్తుంది. దానితో వారే సొంతంగా డ్రోన్ కొనుక్కొని ఎరువుల పిచికారీకి ఉపయోగిస్తారు. ఇందులో ప్రభుత్వం 40 శాతం (రూ.4 లక్షలు) సబ్సిడీ కల్పిస్తోంది. శిక్షణ పూర్తయిన వారు మూడేళ్లపాటు ఆర్బీకే పరిధిలో పనిచేస్తారు.

– మోహన్‌రావు, అగ్రికల్చర్ జేడీ

## పెళ్లికి వచ్చి అనంతలోకాలకు..

- ఒడ్డిమెట్ట వద్ద కారు ఢీకొని మహిళ దుర్మరణం
- ఏడేళ్ల చిన్నారి పరిస్థితి విషమం



మరణించిన నారాయణమ్మ



చికిత్సపొందుతున్న చిన్నారి నందు

**నక్కపల్లి:** ఓ వివాహానికి వచ్చిన మహిళ రోడ్డుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడికి చెందిన వై.నారాయణమ్మ(52) మనుమరాలు నందును తీసుకుని శనివారం రాత్రి 10 గంటలకు నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ట గ్రామంలో బంధువుల వివాహానికి వచ్చింది. పెట్రోలు బంకు సమీపంలో దిగి రోడ్డు దాటుతుండగా విశాఖనుంచి తునివైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది.

ఆమెతో పాటు ఉన్న చిన్నారి నందు తీవ్రంగా గాయపడింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 వాహనానికి ఫోన్‌చేయడంతో వాహన సిబ్బంది శ్రీనివాస్, నాగార్జునలు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని చిన్నారిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్టు సిబ్బంది తెలిపారు.మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు.

### ఈకేవైసీ చేయించుకోవలసిన పింఛనుదార్లు 1099మంది

**అనకాపల్లి టౌన్:** స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలోని 2,739 మంది పింఛన్‌దారుల్లో నేటి వరకు 1,640 మంది ఈకేవైసీ చేయించుకున్నట్టు ఉప ఖజానాధికారి దొడ్డి రమణ శనివారం పేర్కొన్నారు. మిగిలిన 1,099 మంది కూడా ప్రభుత్వ నిబంధనలను అనుసరించి తక్షణమే కార్యాలయంలోగాని, పింఛన్‌దారుల హెచ్ఈఆర్‌బీ యాప్ ద్వారా గాని ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.

## ఆ బాబు ఎయ్యేళ్లు బతకాల..





కొండమ్మతో మాట్లాడుతున్న బూడి, సీఎం జగన్ ఫొటోను కళ్లకు అద్దుకుంటున్న కొండమ్మ

**చీడికాడ:** నవరత్నాలతో ప్రయోజనం పొందిన ప్రజలు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌కు జేజేలు పలుకుతున్న దృశ్యాలు రోజూ కనిపిస్తూనే ఉంటాయి. అలాంటి సందర్భం.. సంభాషణ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం చీడికాడ మండలం చుక్కపల్లిలో పర్యటించినప్పుడు ఎదురైంది. ముచ్చటగొలిపింది. గ్రామంలో 87 ఏళ్ల వృద్ధురాలు కొండమ్మను ముత్యాలనాయుడు పలకరించారు. ఎలా ఉన్నావో కనుక్కోమని జగనన్న పంపించారని చెప్పారు. పింఛన్ సక్రమంగా అందుతుందా అని ఆరా తీశారు. తెల్లవారేసరికే వలంటీరు ఇంటికి వచ్చి ఠంఛనుగా పింఛన్ తెచ్చి ఇస్తున్నారని బామ్మ చెప్పింది. ఈ డబ్బులు ఎవరు పంపిస్తున్నారో తెలుసా అని బూడి ప్రశ్నించగా.. ఆయన చేతిలో బుక్‌లెట్ చూస్తూ ఈ బాబేనని చెప్పింది. బుక్‌లెట్ చేతిలోకి తీసుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను కృతజ్ఞతగా కళ్లకు అద్దుకుంది. ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. భావోద్వేగానికి లోనైంది. 'నాలాంటోళ్లను బతికిస్తున్నది ఈ బాబే.. ఈ బాబు ఎయ్యేళ్లు బతకాల' అంటూ ఆశీర్వదించింది. దీంతో జై జగన్ అన్న నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది.

## రోడ్డు ప్రమాదంలో డాక్టర్ మురళీకృష్ణ మృతి

- కరోనా కష్టకాలంలో విస్తృతంగా సేవలందించిన వైద్యుడు



డాక్టర్ మురళీకృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య పుష్ప



కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తండ్రి సంజీవరావు, (ఇన్‌సెట్) మురళీకృష్ణ (ఫైల్)

**రాంబిల్లి/మునగపాక:** కరోనా కష్టకాలంలో విస్తృతంగా సేవలందించి, అందరి మన్ననలు పొందిన మునగపాకకు చెందిన ప్రైవేటు వైద్యుడు మళ్ల మురళీకృష్ణ (42)రాంబిల్లి మండలం సెజ్ ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. యూనిఫార్స్ పరిశ్రమ నుంచి సుందరం ఎల్లాయిస్ పరిశ్రమకు వెళ్లే రోడ్డు డివైడర్‌ను సోలార ఫార్మా కంపెనీ సమీపంలో బైక్‌తో ఢీకొట్టడంతో ఆయన మృతి చెందినట్టు రాంబిల్లి ఎస్ఐ దీనబంధు తెలిపారు. సుందరం ఎల్లాయిస్‌లో వైద్యుడిగా పనిచేస్తున్న మురళీకృష్ణ విధులకు హాజరవుతుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు.

**మునగపాకలో విషాదఛాయలు**

మురళీకృష్ణ మృతితో మునగపాకలో విషాదఛాయలు అలుముకున్నాయి. మాజీ జెడ్పీటీసీ, మునగపాక గ్రామానికి చెందిన మళ్ల సంజీవరావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. చిన్న కుమారుడు మురళీకృష్ణ వైద్యవిద్య అభ్యసించారు. విశాఖ, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో వైద్యునిగా సేవలందించారు. మురళీకృష్ణ భార్య పుష్ప అగనంపూడి ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. మురళీకృష్ణ దంపతులు అగనంపూడిలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. మురళీకృష్ణ భార్య పుష్ప గుండెలవిసేలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. మురళీకృష్ణ మృతదేహాన్ని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు.

**పలువురి సంతాపం**

విషయం తెలుసుకున్న ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణలతో పాటు మునగపాక గ్రామస్తులు పెద్దసంఖ్యలో ఆస్పత్రికి చేరుకుని మురళీకృష్ణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. డాక్టర్ మురళీకృష్ణ మరణవార్త విని ఆయన అభిమానులు విషాదంలో మునిగిపోయారు.

### సీఎం హామీపై సిక్కుల కృతజ్ఞతలు

**దొండపర్తి (విశాఖ):** రాష్ట్రంలో సిక్కుల అభివృద్ధికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సిక్ మిషన్ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి దిల్‌షా సింగ్ ఆనంద్ ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రిని కలవగా.. ఆయన తమ సమస్యలను సావధానంగా అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు. వాటన్నింటినీ తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. గురుద్వార్ల మీద ఆస్తి పన్ను తొలగించడంతో పాటు గ్రాంథీలకు ప్రయోజనం చేకూరేలా చూస్తామని సీఎం చెప్పినట్లు వివరించారు. తమ సమస్యలపై సీఎం చూపిన చొరవ పట్ల సిక్కు సమాజం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు.

## 'సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలి'

అనకాపల్లి టౌన్: సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సమయంలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నామని ఏపీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు వై.వి.బి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక వైఎంసీఏ కమ్యూనిటీ హాల్లో విశాఖ ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి త్వరలో పార్టీలకు అతీతంగా కమిటీలను ఏర్పాటుచేసి జిల్లాల వారీగా సమస్యలపై కలెక్టరేట్‌ల వద్ద సర్పంచ్‌లు ధర్నా, నిరసనలు నిర్వహించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులకోసం జూన్‌లో చలోఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వానపల్లి లక్ష్మీముత్యాలరావు, ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు పాల్గొన్నారు.

## అనుమానం పెను భూతమై...

- ఆలిని కడతేర్చిన భర్త
- కత్తిపీట చెక్కతో తలపై వేటు
- పోలీస్‌స్టేషన్‌లో లొంగుబాటు
- అనాథలైన ఇద్దరు ఆడపిల్లలు




భర్త చేతిలో హతమైన రాజ్యలక్ష్మి, భర్త నాగేంద్ర

నక్కపల్లి : చదువుకున్న భార్య ఉద్యోగం చేస్తూ ఎక్కడ తనను నిర్లక్ష్యం చేస్తుందోనన్న అనుమానం. తనకు ఫోన్ వాడడం రాదు, ఆమె ఫోన్ వాడుతోంది...ఎప్పుడు ఎవరితో మాట్లాడుతుందో ఎక్కడ తన చేయి దాటిపోతోందోన్న ఆత్మనూన్యతా భావం... వెరసి అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను నిర్దాక్షణ్యంగా చంపేశాడు. నక్కపల్లి మండలం చీడిక గిరిజన గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీడికకు చెందిన చీడిక నాగేంద్రకు వరుసకు మరదలు అయ్యే తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరానికి చెందిన రాజ్యలక్ష్మి(32)తో పదేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో కట్న కానుకలు బాగానే ఇచ్చారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రాజ్యలక్ష్మి డిగ్రీ చదువుకుంది. నాగేంద్ర చదువుకోలేదు. ఏ పనిపాటా లేకుండా తిరుగుతున్నాడు. ఈ పరిస్థితుల్లో ఇంట్లో పూట గడవడం కష్టమై పాయకరావుపేటలో ఒక ప్రైవేటు వస్త్ర దుకాణంలో సేల్స్‌గర్ల్‌గా చేరింది. అవసరార్థం సెల్‌ఫోన్ కూడా కొనుక్కుంది. అయితే భార్య ఉద్యోగం చేయడం, ఫోన్ ఉపయోగించడం తరచూ ఫోన్‌కాల్స్ మాట్లాడడంతో నాగేంద్రలో అనుమానపు బీజాలు ఏర్పడ్డాయి. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. వేధింపులు భరించలేక భార్య కొద్దిరోజులపాటు పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలు సర్ది చెప్పి ఇద్దరినీ కలిపారు. కొద్దిరోజులు బాగానే ఉన్నా, తర్వాత ఒత్తిడి చేసి ఆమెను ఉద్యోగం మాన్పించాడు. అయితే ఆమె తన కుటుంబ సభ్యులతో ఫోన్ మాట్లాడడాన్ని నాగేంద్ర అనుమానించేవాడు. శుక్రవారం రాత్రి రాజ్యలక్ష్మి ఫోన్ మాట్లాడుతుండంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఎప్పటి నుంచో భార్యపై అనుమానం పెంచుకున్న నాగేంద్ర కత్తిపీట చెక్కను తీసుకుని ఆమె తలపై బలంగా కొట్టాడు. దీంతో బలమైన గాయమై రక్తపు మడుగులో పడిపోయిన తల్లిని చూసి ఇద్దరు పిల్లలు భయంతో కేకలు వేశారు. విషయం చుట్టుపక్కల వారికి తెలిసి వారు వచ్చే చూసేటప్పటికే ఆమె రక్తపు మడుగులో ప్రాణాలొదిలింది. నాగేంద్ర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. స్థానికులు మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నారాయణరావు, ఎస్‌ఐ శిరీష సంఘటన స్థలానికి వెళ్లి క్లూస్ టీం సాయంతో వివరాలు సేకరించారు. ఇద్దరి మధ్య కొద్దినెలలుగా జరుగుతున్న ఘర్షణను ఇద్దరు పిల్లలు, స్థానికులు పోలీసులకు తెలిపారు. భార్యపై అనుమానంతోనే



రక్తపు మడుగులో ఉన్న రాజ్యలక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నారాయణరావు

నాగేంద్ర ఈ హత్యకు పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో వెల్లడైనట్టు సీఐ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించామన్నారు.

**అమ్మ లేక అనాథల్లా మారిన పిల్లలు**

కళ్ల ముందే కన్న తల్లిని తండ్రి నిదాక్షిణ్యంగా హత్య చేయడంతో ఇద్దరు చిన్నారులు భయభ్రాంతులకు గురయ్యారు. భయంతో ఏం జరిగిందో, ఏం చెప్పాలో అని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తల్లి మృతదేహం ముందు కన్నీరు మున్నీరుగా రోధిస్తున్నారు. అమ్మనాన్నల మధ్య సఖ్యత లేకపోయినప్పటికీ అమ్మ వారిని కంటికి రెప్పలా కాపాడుకునేది. తండ్రి జులాయిగా తిరుతున్నా ఏ లోటు లేకుండా తల్లి చూసుకునేదని, ఇప్పుడు ఆమెను తండ్రి పొట్టన పెట్టుకోవడంతో పిల్లలు అనాథలయ్యారని చుట్టుపక్కల వారు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

## ప్రతి పీహెచ్‌సీలో 14 మంది ఉద్యోగులు

- జోరుగా సర్దుబాటు చర్యలు
- పీహెచ్‌సీలు, హెల్త్ క్లినిక్‌ల్లో అన్ని రకాల మందులు
- 39 సెంటర్లలో ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాం
- డీఎంహెచ్‌వో హేమంత్



దేవరాపల్లి పీహెచ్‌సీలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

దేవరాపల్లి: జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో 14 మంది ఉద్యోగులు ఉండేలా సర్దుబాటు చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో నాడు-నేడులో చేపట్టిన మరమ్మతులను వైద్యాధికారి ఎస్.లలితతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. మిగిలిన చిన్నపాటి మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు ఫోన్లో సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.20 కోట్లతో స్థానిక పీహెచ్‌సీలో అదనపు భవనం నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. 143 జీవో ప్రకారం జూన్ నాటికి సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.

**నాణ్యమైన వైద్యసేవలే లక్ష్యంగా...**

గ్రామ స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాంను జిల్లాలో 39 సెంటర్లలో నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రతి నెలా 25 రోజుల పాటు 938 గ్రామాల్లో అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో 172 రకాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో 105 రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు. నాడు-నేడు పథకంలో 38 పీహెచ్‌సీ భవనాలకు మరమ్మతులు చేపట్టగా, వీటిలో 30 పూర్తయ్యాయని, ఎనిమిది భవనాలు నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు 377 మంజూరు కాగా, ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 10 భవనాలను ప్రారంభించామన్నారు.

**నేటి నుంచి జిల్లాలో తీవ్ర వడగాడ్పులు**

జిల్లాలో ఆదివారం నుంచి పది రోజుల పాటు తీవ్రమైన వడగాడ్పులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో తెలిపారు. అత్యవరసరమైతే తప్పా ఎవరూ బయటకు రావోద్దని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, స్టాఫ్‌నర్స్ రాణి ఉన్నారు.

## మట్టిలో మాణిక్యం హేమశ్రీ

**డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు అభినందన**



హేమశ్రీని అభినందిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి కార్పొరేట్‌కు దీటుగా పదో తరగతి పరీక్షల్లో 594 మార్కులు సాధించిన కామిరెడ్డి హేమశ్రీ మట్టిలో మాణిక్యమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అభినందించారు. మండలంలోని కొత్త పెంటకు చెందిన అచ్యుతాపురం గురుకుల పాఠశాల విద్యార్థిని హేమశ్రీని శాలువాతో సత్కరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన హేమశ్రీ ప్రభుత్వ పాఠశాలలో చదివి జిల్లా టాపర్‌గా నిలవడం గొప్ప విషయమన్నారు. హేమశ్రీ తల్లిదండ్రులు శ్రీనివాసరావు, గోవిందమ్మలను సైతం ఆయన అభినందించారు. విద్యా రంగంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడానికి దోహదపడ్డాయన్నారు. సర్పంచ్ రొంగలి వెంకటరావు పాల్గొన్నారు.

## అధికార లాంఛనాలతో హెచ్‌సీకి అంత్యక్రియలు


కె.కోటపాడు: మండలంలోని చంద్రయ్యపేటలో హెచ్‌సీ గవిరెడ్డి దేముడుబాబు మృతదేహానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. గొలుగొండ పోలీసు స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్న దేముడుబాబు ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు ఆయన మృతికి సంతాప సూచికంగా గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అశ్రునయనాలతో పోలీసులు గౌరవ వందనం స్వీకరణ మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. నర్సీపట్నం డీఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్, నర్సీపట్నం రూరల్ సీఐతోపాటు గొలుగొండ, కె. కోటపాడు ఎస్సైలు నారాయణరావు, ధనుంజయ్ హాజరై పూలమాలలతో నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు.



దేముడుబాబు అంత్యక్రియల్లో పోలీసుల గౌరవ వందనం










**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## క్లుప్తంగా

### ఆకట్టుకున్న భక్తిగీతాలాపన



భక్తిగీతాలు ఆలపిస్తున్న విష్ణుమూర్తి, గాయనీగాయకులు

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివేకానంద కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేంకటేశ్వరస్వామి భక్తిగీతాల ఆలాపన భక్తులను ఆకట్టుకుంది. ఏడుకొండలవాడిపై గాయనీ గాయకులు పలు భక్తిగీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

### 14 నుంచి మృత్యుంజయ హోమం

అనకాపల్లిటౌన్: మండలంలోని బట్లపూడి గ్రామంలో సోహన్ ఆశ్రమంలో లోక కల్యాణార్థం ఈనెల 14 నుంచి 90రోజుల పాటు మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్టు ఆశ్రమ వ్యవస్థాపకుడు రవి శనివారం తెలిపారు. ప్రతి రోజూ 12 గంటల పాటు జరిగే ఈ హోమంలో పాల్గొనే భక్తులు ఆవు పేడతో చేసిన పిడకలు, రోజుకు రెండు కిలోల ఆవు నెయ్యి తీసుకుని రావాలని ఆయన కోరారు. పూజలో పాల్గొనే భక్తులు 9966908908 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

### నేడు గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ అధ్యక్షుడు మద్దాల కూర్మారావు శనివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు గౌరీపరమేశ్వరులకు అభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన, సాయంత్రం 6 గంటల నుంచి గౌరీపరమేశ్వరుల కల్యాణ వేడుకలు జరుగుతాయని ఆయన తెలిపారు.

### ముమ్మరంగా వరి నూర్పులు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో వరి నూర్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నూర్పు పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ఖరీఫ్ నూర్పులతో పాటు రబీ నూర్పులు దాదాపు ఈ వారంలో పూర్తి కానున్నాయి. నూర్పులు పూర్తి చేసిన రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు ప్రయివేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది వరి కోత, నూర్పు పనులకు యంత్రాలను వినియోగించారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 451 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 4,600 | 4,600 |
| రెండో రకం | 4,000 | 4,530 |
| మూడోరకం | 3,300 | 3,960 |

### అనకాపల్లి సినిమాలు

| | | |
|---|---|---|
| కస్టడీ | : | రాజా |
| రామబాణం | : | సత్యనారాయణ-1 |
| ఫర్హానా | : | సత్యనారాయణస్క్రీన్-2 |
| ది కేరళ స్టోరీ | : | షిర్డీసాయి |
| విరుపాక్ష | : | పర్తిసాయి |
| కథ- కథ | : | వెంకటేశ్వర |
| ఉగ్రం | : | శ్రీసత్య |
| ఏజెంట్ | : | రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 125 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బి పాజిటివ్-39 యూనిట్లు, ఒ పాజిటివ్-78 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 395 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.



# విజ్ఞానం..వినోదం

- కలబోతగా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా హాజరవుతున్న విద్యార్థులు
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు తరగతులు
- జూన్ 15 వరకు కొనసాగనున్న కార్యక్రమాలు

తుమ్మపాల: చిన్నారులకు విజ్ఞానం, వినోదం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వేసవి సెలవుల్లో సమయం వృథా కాకూడదని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసింది. ఆటపాటలతో శిక్షణ తరగతులు నిర్వహించి పిల్లల్లో మానసిక వికాసం పెంచుతోంది. పలు గ్రంథాలయాల్లో ఈ నెల 2 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అనకాపల్లి పట్టణంలోని ప్రధానంగా శ్రీగౌరీ గ్రంథాలయం, శారదా గ్రంథాలయాల్లో వేసవి తరగతుల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఒక్కో గ్రంథాలయంలో 300 మందికి తక్కువ కాకుండా పిల్లలు హాజరవుతున్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు కంప్యూటర్, 15వ తేదీ వరకు చిత్రలేఖనం, తదితర అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు.



కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్నవిద్యార్థులు



శ్రీగౌరీ గ్రంథాలయంలో చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

**సృజనాత్మకత వెలికితీసేలా......**

చిన్నారుల్లో సృజనాత్మకత వెలికితీసేలా గ్రంథాలయ శాఖ వేసవి శిబిరాలను నిర్వహిస్తోంది. విద్యార్థులను పుస్తక పఠనం వైపు మళ్లించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.సాహిత్యం, చిత్రలేఖనం, సంగీతం, భావవ్యక్తీకరణ, ఆకట్టుకునేలా కథలు చెప్పడం, తెలుగు భాషపై పట్టు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. పుస్తక పఠనం, చదరంగంతో పాటు వినోదం, విజ్ఞానం కలబోతగా పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. పట్టణంలోని రెండు గ్రంథాలయాలతో పాటు మండలంలో తుమ్మపాల గ్రంథాలయంలో దాతల సహకారంతో విరామ సమయంలో విద్యార్థులకు బిస్కెట్లు, మజ్జిగ అందజేస్తున్నారు. ఆసక్తి ఉన్న 5 నుంచి 16 ఏళ్ల మధ్య చిన్నారులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు.

**రోజువారీ శిక్షణ ఇలా..**

- ఉదయం 7నుంచి 8 గంటల వరకు కంప్యూటర్ థియరీ తరగతులు.
- ఉదయం 8 నుంచి 10 గంటల వరకు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివించడం.
- ఉదయం 10 నుంచి 10.10 గంటల వరకు విరామం.
- ఉదయం 10.10 నుంచి 11 గంటల వరకు కథలు చెప్పడం.
- ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, హిందీ, చిత్రలేఖనం, పెయింటింగ్, సంగీతం, యోగా, ధ్యానం నేర్పించడం.

**కొత్త అంశాలు నేర్చుకుంటున్నాను**



చిత్రలేఖనం అంటే ఇష్టం. బొమ్మలు వేస్తుంటాను. గ్రంథాలయంలో మరిన్ని మెలకువలు నేర్పిస్తున్నారు. వేసవి సెలవులను ఇలా ఉపయోగించుకుంటూ కొత్త అంశాలను నేర్చుకుంటున్నాను. కంప్యూటర్ కూడా నేర్చుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది.

– ఉత్కర్ష, 8వ తరగతి విద్యార్థి.

**పుస్తకాలు చదివే అవకాశం**



కొత్త విషయాలు నేర్చుకుంటున్నాను. ముఖ్యంగా స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్ నేర్చుకుంటున్నాను. గ్రంథాలయంలో చాలా పుస్తకాలు ఉన్నాయి. వాటిని చదివే అవకాశం కలుగుతోంది. కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు.థియరీ తరగతులు ఉదయం 9 గంటల వరకు చెబుతున్నారు.

– వి.సాగర్, 9వ తరగతి విద్యార్థి

**సెలవులు సద్వినియోగం**



ముప్పై రోజుల పాటు కంప్యూటర్ కోర్సు నేర్పుతున్నారు. సర్టిఫికెటు ఇస్తారు. వేసవి సెలవులను ఇలా సద్వినియోగం చేసుకుంటున్నాను.

–డి.సోహన్, 8వ తరగతి విద్యార్థి

**నిపుణులతో శిక్షణ**



విద్యార్థుల్లో పఠనాసక్తి, విజ్ఞానాన్ని పెంపొందించడానికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయి. వేసవి శిక్షణ శిబిరాలు పిల్లల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఎంతో దోహదపడుతున్నాయి. నిపుణులతో పిల్లలకు తర్ఫీదు ఇస్తున్నాం. గౌరీ గ్రంథాలయంలో కంప్యూటర్స్‌లో 150, చిత్రలేఖనంలో 200 మంది కలిపి మొత్తం 350 మంది వరకు పిల్లలు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు.

–మళ్ల బాపునాయుడు, వేసవి సెలవుల శిక్షణ శిబిరం కోఆర్డినేటర్, శ్రీగౌరీ గ్రంథాలయం

## నేడు హనుమజ్జయంతి వేడుకలు

అనకాపల్లిటౌన్: స్థానిక మల్లిమణుగులవారివీధి, వేల్పులవీధి, లక్ష్మీదేవిపేట, గాంధీనగరం, గవరపాలెం తదితర ప్రాంతాల్లోని శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. తెల్లవారు జాము 5గంటల నుంచి స్వామివారు మేలుకొలుపు, గణపతిపూజ, పంచామృత అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని, మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నామని కమిటీల సభ్యులు తెలిపారు.

**కశింకోటలో..**

కశింకోట: స్థానిక రిక్షా స్టాండ్ వద్ద గల అభయాంజనేస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు, యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నారు. గవరపేటలోని శారదా గణపతి రామాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం, కస్పావీధిలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో కూడా హను మజ్జంతి నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## నేడు లాంగ్‌వాక్

అనకాపల్లిటౌన్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున 5గంటల నుంచి లాంగ్‌వాక్ నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ తెలిపారు. నెహ్రూచౌక్ నుంచి కొత్తూరు పంచాయతీ ఎర్రచెరవు వరకు, తిరిగి నెహ్రూచౌక్ మీదగా జార్జిక్లబ్ వరకూ లాంగ్‌వాక్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 8గంటలకు జార్జీక్లబ్ ఆవరణలో వివిధ రకాల వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తలపై సీనియర్ వైద్యుడు డి.డి.నాయుడు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

## లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

అనకాపల్లిటౌన్: లోక్‌అదాలత్ తీర్పు అంతిమతీర్పు అని, జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి గంగరాజు అన్నారు. జాతీయలోక్ అదాలత్ సందర్భంగా శనివారం స్థానిక న్యాయస్థాన సముదాయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్షిదారులు విలువైన సమయాన్ని కోర్టులు చుట్టూ తిరుగుతూ పాడుచేసుకోవద్దని చెప్పారు. సత్వర న్యాయం, రాజీ వంటివి లోక్ అదాలత్‌లో జరుగుతాయన్నారు. దీర్ఘకాలంపాటు కోర్టుల చుట్టూతిరిగి సమయం, ఆదాయం నష్టపోయే కన్నా లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం ఉత్తమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి గోవర్థన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీపా, 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రవికిరణ్, స్పెషల్ కోర్టు జడ్జి రామచంద్రమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలక్ష్మణరావు, కార్యదర్శి సూరా శ్రీనివాస్, సభ్యులు కింతాడ ఈశ్వరరావు, సాయిరాం, రామచంద్రరావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య



సమావేశంలో మాట్లాడుతున్న జయబాబు

అనకాపల్లిటౌన్: వర్తకసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లింగమూర్తి కళాశాలలో సేవాభావంతో లాభాపేక్ష లేకుండా పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ గెల్లా జయబాబు తెలిపారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో శనివారం జరిగిన ఏఎంఏఎల్ కళాశాల పూర్వపు విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు కళాశాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంఘం ఏటా సుమారు రూ.కోటి వరకు కళాశాల నిర్వహణకు ఖర్చు చేస్తోందన్నారు. కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల పోటీని తట్టుకుని మంచి ఫలితాలు సాధిస్తున్నట్టు ఆయన చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థుల వైబ్‌సైట్‌లో పూర్వవిద్యార్థులందరూ నమోదు కావాలని కోరారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు, కె.ఎస్.వి.సత్యనారాయణ, కళాశాల పీడీ కొణతాల అప్పలస్వామి, గౌరీ టీచర్స్ ఫెడరేషన్ కార్యదర్శి కొణతాల రాజేంద్రప్రసాద్, సంఘ ప్రతినిధులు ఆడారి నరసయ్యానాయుడు, పొలిమరశెట్టి బలరాం, కొణతాల రామచంద్రరావు, విల్లూరి అప్పలనాయుడు, ఆడారి గంగాధర్, వైడీవీకె.ప్రసాద్, శరగడం వెంకటేశ్వరరావు, కాండ్రేగుల అప్పారావు పాల్గొన్నారు.

## 'డైట్' కళాశాల విజయాలపై బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ దాడి రత్నాకర్

తుమ్మపాల: పట్టణంలోని 'డైట్' కళాశాల విజయాలు, విశిష్ట అతిథులు, ప్రత్యేకతలపై రూపొందించిన 'డైట్-2023' బ్రోచర్‌ను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల, విద్యార్థులు సాధించిన విజయాలు, అవార్డులతో పాటు కళాశాలకు వివిధ సందర్భాల్లో విచ్చేసిన విశిష్ట అతిథుల వివరాలు పొందుపరిచినట్టు తెలిపారు. మౌలిక వసతులు, ఆధునిక ఆవిష్కరణలు, నూతన కోర్సుల వివరాలు కూడా ఉంటాయన్నారు. బ్రోచర్ ద్వారా కళాశాల పూర్తి ప్రత్యేకతను తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చల్లా నరసింహం, వైస్‌ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, డీన్ అడ్మిన్ కె.ఎస్.ఈశ్వరరావు, అకాడమిక్ డీన్ ఎ.కృష్ణనాగ్, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొడుకు కడసారి చూపునకూ నోచుకోలేదు..

- విషాదం నింపిన రోడ్డు ప్రమాదం
- ఛిన్నాభిన్నమైన పాస్టర్ కుటుంబం
- కాళ్లు చేతులు విరిగి కుటుంబం అంతా ఆస్పత్రిపాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్, భార్య భారతి, కుమార్తె శృతి

నక్కపల్లి: నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం ఆ నిరుపేద కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో కుటుంబం అంతా తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయింది. వీరిలో ఆరేళ్ల కుమారుడు చికిత్స పొందుతూ మరణించగా మిగిలిన వారు కాళ్లు చేతులు విరిగిపోయి ఆస్పత్రిలో మంచాన పడ్డారు. కన్నకొడుకు చివరి చూపునకు కూడా నోచుకోలేని ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. దీనికి తోడు వైద్య ఖర్చులకు ఆర్థిక స్థోమత లేక ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే నక్కపల్లికి, సారిపల్లిపాలేనికి మధ్య ఈనెల 10తేదీన ఐషర్ వ్యాన్ ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఆటో వెనుక బైక్‌పై వెళ్తున్న నక్కపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు, పాస్టర్ అయిన పెదపాటి కిరణ్ కుటుంబం తీవ్రగాయాలపాలైన విషయం విదితమే. ఈ ఘటనలో కిరణ్ ఆరేళ్ల కుమారుడు సుధీర్ లాజర్ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ 11వ తేదీన మరణించాడు. కిరణ్‌కు కాలు విరిగిపోయింది. అతని భార్య భారతికి రెండు చేతులు, కాలు విరిగిపోయింది. కుమార్తె శ్రుతికి కూడా కాలు విరిగిపోయింది. వీరంతా సిమెంట్ కట్లతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కుమారుడు లాజర్ కడసారి చూపునకు కూడా తల్లిదండ్రులు నోచుకోలేదు. ఎస్సీ కాలనీలో చిన్నపెంకుటింట్లో నివసిస్తూ పాస్టర్‌గా చిన్నపాటి వైద్య సేవలు అందిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కిరణ్ కుటుంబం విధి వక్రించి ప్రమాదం బారిన పడడంతో ఆదాయం లేక మందులు కొనుగోలుకూ స్థోమత లేక ఇబ్బంది పడుతున్నట్టు బాధితుడి స్నేహితులు తెలిపారు. మిత్రులు, బంధువులు తోచిన సాయం అందిస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి కిరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## రేపటి నుంచి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లిటౌన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్‌అయిన విద్యార్థినీవిద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌ల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఆయన చెప్పారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. దరఖాస్తుతో పాటు పదోతరగతి మార్కుల మెమో, టీసీ, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జెరాక్స్ కాపీలు, తల్లి బ్యాంక్ అకౌంట్ పాస్‌పుస్తకం జెరాక్స్ కాపీ అందజేయాలని ఆయన కోరారు.

## మృతి చెందిన హెచ్‌సీ భార్యకు ఆర్థికసాయం



అప్పన్న భార్య ధనలక్ష్మికి చెక్ అందజేస్తున్న పోలీస్ సిబ్బంది

అనకాపల్లిటౌన్: హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన పి.అప్పన్న భార్య ధనలక్ష్మికి రూ.75వేలు ఆర్థిక సాయాన్ని 1990 బ్యాచ్ పోలీస్ సిబ్బంది అందజేశారు. శ్రీకాకుళం జిల్లా పోలాకి గ్రామంలో ధనలక్ష్మి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, నగదు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాచ్‌మేట్స్ వెంకటేశ్వరరావు, పూర్ణచంద్ర, అనిల్, నాయుడు, రమేష్‌లు మాట్లాడుతూ అప్పన్న విశాఖ ఉమ్మడి జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారని చెప్పారు. అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ తీవ్ర అనారోగ్యంతో ఈ నెల 3న మృతి చెందినట్టు చెప్పారు.

## 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.పి.ఎస్. శ్రీలక్ష్మి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆమె శనివారం విలేకరులకు తెలిపారు. 2023-24 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.75, ఓసీ, బీసీలకు సంబంధించి రూ.150 ఫీజుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష మోడల్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



మునగపాకలో ఇంటింటా ధర్మ ప్రచారం స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ప్రతి ఒక్కరూ సనాతన సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ప్రచారంలో భాగంగా స్టిక్కర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ధర్మ ప్రచారం ద్వారా హిందువుల్లో మంచి చైతన్యం వస్తుందన్నారు. ఫౌండేషన్ సబ్‌డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, జిల్లా సభ్యుడు రమణ, మండల కన్వీనర్ ఆడారి లక్ష్మణరావు,ఆడారి ఉమాశంకర్ పాల్గొన్నారు.

## కేంద్రం తీరుతో దళితులపై దాడులు

దళిత హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్





మాట్లాడుతున్న దళిత హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్

అనకాపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ వైఖరితో దేశ వ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగాయని దళిత హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం అనకాపల్లి సీపీఐ కార్యాలయంలోని జిల్లా దళిత హక్కుల పోరాట సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ప్రభావంతో ప్రధాని నరేంద్ర మోదీ దళితుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన అనేక ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరించేందుకు, కార్పొరేట్లకు వాటిని కట్టబెట్టేందుకు ప్రధాని యత్నించడం దారుణమని అభిప్రాయపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట కమిటీ జిల్లా కార్యదర్శి పెద్దాడ లోవరాజు, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు, ఉపాధ్యక్షుడు మండే సత్యనారాయణ, ఆఫీసు బేరర్లు కొండ్రు అప్పారావు, బందుల సుబ్బలక్ష్మి, నాగరత్నం, రాము, అప్పారావు, పెద్దాడ కృష్ణ పాల్గొన్నారు.

## కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు



కార్యకర్తకు మిఠాయి తినిపిస్తున్న భానుమూర్తి

అనకాపల్లిటౌన్: కర్ణాటక రాష్ట్ర ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయిన భానుమూర్తియాదవ్ అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 136 స్థానాల్లో విజయం సాధించడం పట్ల ఆ పార్టీ నాయకులు శనివారం స్థానిక నెహ్రూచౌక్‌లో సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా భానుమూర్తియాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ విజయంతో దేశంలో బీజేపీకి చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అంతకుముందు పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ కో కన్వీనర్ ఐ.ఆర్.గంగాధర్, పీసీసీ మాజీ సభ్యుడు కె.ఎస్.ఎ.రామయ్యానాయుడు, జిల్లా నాయకులు కత్తెర శ్రీధర్, కాళ్ల సత్యనారాయణ, సేనాపతి రాజు, కె.వి.మాణిక్యం పాల్గొన్నారు.

## మహిళా రెజ్లర్లకు మద్దతుగా నిరసన



నిరసన చేస్తున్న విద్యార్థులు

తుమ్మపాల: భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద విద్యార్థులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శులు జి.ఫణీంద్ర, వియ్యపు రాజు మాట్లాడుతూ దేశ ప్రతిష్టను ప్రపంచమంతా చాటుతున్న మహిళా రెజ్లర్లపై లైంగిక చర్యలకు పాల్పడిన ఎంతటి వారైనా శిక్షించి తీరాలన్నారు. 20 రోజులుగా ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద మహిళ రెజ్లర్లు నిరసన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత దారుణమన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించి ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఏలేరు కాల్వలో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం



ఉగ్గినపాలెంలో ఏలేరు కాలువ నుంచి వెలికి తీసిన అప్పారావు మృతదేహం

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామం వద్ద ఏలేరు కాలువలో గల్లంతైన వృద్ధుని మృతదేహం శనివారం లభ్యమైనట్టు అదనపు ఎస్ఐ జెక్కుల నాగేశ్వరరావు తెలిపారు. తాళ్లపాలెం గ్రామానికి చెందిన తనకాల అప్పారావు(63) పక్కనున్న ఉగ్గినపాలెం వెళ్లి అక్కడి ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ కాలుజారి పడి గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే గ్రామం వద్ద ప్రమాద స్థలానికి కొంత దూరంలో మృతదేహం తేలడంతో కాలువ నుంచి వెలికి తీసి పోస్టుమార్టం కోసం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.